ప్రజాశక్తి

సోమవారం 21 అక్టోబర్ 2024 5 అనంతపురం



వేళ్లూనిన మెడికల్ మాఫియా



ఉమ్మడి జిల్లాలో మెడికల్ మాఫీయా వేళ్లూనింది. మందుల దుకాణాలను ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. దుకాణం నిర్వహించే వ్యక్తి ఫార్మసిస్ట్ అయి ఉండాలన్న నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. ఏమాత్రం అవగాహన లేని వారు మందులను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సంబంధిత అధికారులు తనిఖీలకు స్వస్తి చెప్పి చర్యలకు ముఖం చాటేశారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. దీంతో మందుల దుకాణదారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. వైద్యులు ధ్రువీకరించిన మందుల చీటీ ఉంటేనే మందులు ఇవ్వాల్సి ఉండాలన్న నిబంధన కూడా ఎక్కడా అమలు కావడం లేదు.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి జిల్లాలో 2 వేలకు పైగా మెడికల్ షాపులు

ఇష్టారాజ్యంగా నిర్వహణ

ఫార్మాసిస్టులు లేని దుకాణాలే ఎక్కువ

విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్ మందుల విక్రయం

జిల్లాలో మెడికల్ షాపులు ప్రొవిజన్ స్టోర్స్ మాదిరిగా విచ్చలవిడిగా ఏర్పాటవుతున్నాయి. కొద్ది రోజుల పాటు మెడికల్ షాపుల్లో పని చేసిన వారంతా సొంతంగా దుకాణాలు తెరుస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే దాదాపు 70 శాతం వరకు ఫార్మసిస్టు లేని దుకాణాలే ఉన్నాయని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2030 వరకు మెడికల్ షాపులున్నాయి. ఇందులో హోల్ సేల్ 365 వరకు కాగా, రిటైల్ దుకాణాలు 1,665 వరకు ఉన్నాయి. ఒక్క హిందూపురం పట్టణంలోనే దాదాపు 110 వరకు మెడికల్ షాపులు ఉన్నాయి. మారు మూల ప్రాంతం అయిన అమరాపురంలో 4 షాపులు ఉన్నాయి. ఇవి కాక గ్రామాల్లో సైతం మెడికల్ షాపులు ఉన్నాయి. వీటితో పాటు ఎక్కడైనా ఆస్పత్రి కొత్తగా ఏర్పాటు చేస్తున్నారంటే దానికి అనుసంధానంగా మందుల దుకాణం పెట్టడానికి పోటీ విపరీతంగా ఉంటుంది. జిల్లాలో కొన్ని మల్టీస్పెషాలిటీ ఆస్పత్రుల్లో మందుల దుకాణం ఏర్పాటుకు పోటీ దారులు లక్షల రూపాయలు గుడ్ విల్‌గా ఇచ్చేందుకు వెనకాడటం లేదని సమాచారం. మందుల దుకాణంలో వచ్చే ఆదాయం ఎక్కువగా ఉంటుండడంతో ఆ ఆస్పత్రుల వర్గాలే సొంతంగా మెడికల్ షాపులను ఏర్పాటు చేసుకుంటున్నాయి.

నామమాత్రపు తనిఖీలు

జిల్లాలో మందుల దుకాణాల నిర్వహణపై ఔషధ నియంత్రణ శాఖ సహాయక సంచాలకుడి పర్యవేక్షణతో పాటు డ్రగ్ ఇన్ స్పెక్టర్ల పర్యవేక్షణ కూడా ఉంటుంది. అయితే వీరు నామమాత్రపు తనిఖీలు నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాదిలో దాదాపు 270 వరకు కేసులు నమోదు అయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో అనంతపురం నగరంలోనే ఎక్కువగా నమోదు అయినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో హిందూపురం అతిపెద్ద పట్టణం. ఇక్కడ రెగ్యులర్‌గా డ్రగ్ ఇన్స్‌పెక్టర్ లేక పోవడం ఔషధ నియంత్రణ శాఖ పనితీరుకు అద్దం పడుతోంది. సంబంధిత శాఖాధికారులు పూర్తిస్థాయిలో చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తే వందల కొద్ది కేసులు నమోదయ్యే అవకాశం ఉంది. జిల్లా అధికారుల సరైన చర్యలు లేకపోవడంతో మందుల దుకాణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మందుల దుకాణాలకు లైసెన్సులున్నాయా...? సంబంధిత సర్టిఫికెట్ ఉన్న పార్మసిస్ట్ దుకాణం నిర్వహిస్తున్నారా...? మందులు ఇచ్చే అనుభవం ఉందా...? తదితర విషయాలపై పూర్తి స్థాయిలో విధిగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా అధికారులు దుకాణాలపై దృష్టి సారించి జరుగుతున్న పొరపాట్లను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అర్హత, అనుభవం లేని వ్యక్తులు నిర్వహించే మందుల దుకాణాల వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది.



పట్టణంలోని డ్రగ్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయం

నిబంధనల అమలెక్కడ....?

మందుల దుకాణాల్లో ఫార్మసిస్టు మాత్రమే మందులు ఇవ్వాల్సి ఉంటుంది. దుకాణం నిర్వహిస్తున్న సమయాల్లో ఆయన పర్యవేక్షణలోనే మందుల విక్రయాలు జరగాలి. కానీ సింహ భాగం రిటైల్ దుకాణాల్లో ఫార్మసిస్టు లేరు. పట్టణాల్లోనే ఈ పరిస్థితి కొనసాగుతుంటే ఇక గ్రామాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. కొన్నిచోట్ల ఎలాంటి ఫార్మసిస్ట్ పత్రం లేకుండానే మందులు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇతరుల సర్టిఫికెట్లను అద్దెకు తెచ్చుకుని దుకాణాలను నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఎంబిబిఎస్ వైద్యులు సిఫార్సు చేసిన మందుల చీటి ఆధారంగానే జలుబు, జ్వరం వంటి చిన్న చిన్న రోగాలకు సైతం మందుల ఇవ్వాని ఉంటుంది. అయితే ప్రిస్క్రిప్షన్ లేకుండానే చిన్న పిల్లలు వెళ్లి అడిగినా మందు బిళ్లలు ఇచ్చేస్తున్నారు. ఇక దుకాణాల్లో అమ్మే మందుకు కొనుగోలుదారులకు ఎలాంటి బిల్లులు ఇవ్వడం లేదు. తెచ్చే మందులకు, విక్రయించే మందులకు ఎలాంటి రిజిస్టర్లు అమలు చేయడం లేదు. ఎవరైనా రీయింబర్స్‌మెంట్ కోసం కొనుగోలు చేసేందుకు బిల్లులు అడిగితే ఎమ్మార్పీ ధరలు, దానిపై జీఎస్టీ వేసి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. పలు దుకాణాలకు జీఎస్టీ కూడా లేకపోవడం విశేషం.

అర్హతలేని వారిని నియమిస్తే చర్యలు

జిల్లాలోని ప్రతి మెడికల్ షాపులో అర్హత ఉన్న ఫార్మాసిస్టును మాత్రమే నియమించుకోవాలి. అర్హత లేని వారిని నియమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అలా నియమించారో.. లేదో తెలుసుకోవడానికి పని చేస్తున్న సిబ్బంది పాన్ కార్డు, బ్యాంకు ఖాతాల వివరాలు అడిగి తెచ్చుకున్నాం. వేతనాలు కూడా వారి ఖాతాల్లోనే పడాలి. డాక్టర్లు రాసిన ప్రిస్క్రిప్షన్‌కు మాత్రమే మందులు ఇవ్వాలి. ప్రజలు కూడా ఇష్టారాజ్యంగా మందులు కొనుగోలు చేసి వాడుకోరాదు. అలా వాడుకుంటే దీర్ఘకాలంలో అనారోగ్య సమస్యలు వస్తాయి. మెడికల్ షాపు వారు అమ్మిన ప్రతి మందుకు బిల్లు ఇవ్వాలి. ప్రజలు కూడా అడిగి తీసుకోవాలి. బిల్లులు ఇవ్వకుండా మందులను విక్రయిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

రమేష్ రెడ్డి,
ఏడీ, జిల్లా ఔషధనియంత్రణ శాఖ

సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

కనీస నిర్వహణ లేక సాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తం

బస్సుయాత్ర అనుభవాలపై సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



అత్యంత కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాలో సాగునీటి వసతి పదిశాతం లోపే ఉంది. ఈ అతి తక్కువ నీటిని అందించే ప్రాజెక్టుల నిర్వహణ కూడా అధ్వాన్నంగా ఉండటంతో రైతాంగానికి సాగునీటి ఇక్కట్లు తప్పేలా లేవు అని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి 19 వరకు ఐదు రోజుల పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సిపిఎం బస్సు యాత్రను చేపట్టింది. ఈ యాత్రకు రాంభూపాల్ నేతృత్వం వహించారు. ఈ యాత్రలో సిపిఎం బృందం పరిశీలించిన అంశాలను ఆయన ప్రజాశక్తితో పంచుకున్నారు.

యాత్ర ఇలా సాగింది

ఈనెల 15వ తేదీన బొమ్మనహాల్ మండలం ఉంతకల్లు రిజర్వాయరుకు శంకుస్థాపన చేసిన ప్రాంతం నుంచి బస్సు యాత్ర ప్రారంభమైంది. జిల్లాలో 24 మండలాల్లో 124 గ్రామాల్లో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా 18 ప్రాంతాల్లో సాగునీటి వ్యవస్థలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో నాయకులకు సుమారు 18 వేల మందితో కలిసే అవకాశం ఏర్పడింది.

కనీస నిర్వహణ లేకుండా ఉన్న ప్రాజెక్టులు

అనంతపురం జిల్లాలోని ఏ ప్రాజెక్టు వద్ద చూసినా కనీస నిర్వహణ కనిపించదు. నిధుల్లేక అన్నీ ప్రాజెక్టులు అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. భైరవానితిప్ప ప్రాజెక్టు వద్ద మొదటి గేటు పూర్తిగా స్ట్రక్ అయిపోయింది. గేట్లు ఎత్తేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక గది మొత్తం శిథిలావస్థకు చేరింది. అత్యవసర పరిస్థితుల్లో గేట్లు ఎత్తాల్సి వస్తే ఏవీ పనిచేసే విధంగా లేవు. ఇక మిడ్‌పెన్నార్ వద్ద గేట్లలో సమస్యలున్నాయి. హంద్రీనీవా మొదటి దశ పూర్తయ్యే జీడిపల్లి రిజార్వాయరు వద్ద కూడా కాలువ పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. శ్రీశైలంలో నీరు పుష్కలంగా ఉన్న పూర్తి సామర్థ్యంతో ఇప్పటికీ నింపలేకపోతున్నారు. సుబ్బరాయసాగర్‌కు రెండు తూములుంటే ఒక తూము పూర్తిగా పనిచేయడం లేదు. ఈ ప్రాజెక్టు ఇప్పటికీ నీటి విడుదల లేదు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఎక్కడిక్కడ దెబ్బతినింది. పూర్తి సామర్థ్యంతో నీటిని తీసుకునే అవకాశం లేదు. జిల్లాలో అనేక చెరువులు, కుంటలున్నాయి. ఈ చెరువులకు కుంటలకు నీటిని అందించే ఏ కాలువలు సరిగాలేవు. చెరువుల మరమ్మతులు చేపట్టాల్సినవి చాలా ఉన్నాయి.

ప్రధానమైన డిమాండ్లు

అంతకు ముందు ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలైనా ఇప్పుడున్న ప్రభుత్వమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ఏ మాత్రం శ్రద్ధ పెట్టలేదు. అందుకే దశబ్దకాలమవుతున్నా ఈ సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణ పనులు జరగడం లేదు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పూర్తిగా అటకెక్కించారు. నిర్మాణం చేపడతామని శంకుస్థాపన చేసిన ఉంతకల్లు రిజర్వాయరు శిలాఫలకం కూడా ఇప్పుడు లేదు. కనీసం డిపిఆర్ తయారీ కూడా చేయలేదు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ 2008లో చేపడితే ఇప్పటికీ పూర్తవలేదు. గత ప్రభుత్వ హయంలో ఏకంగా ఆ పనులనే రద్దు చేశారు. ఈ ప్రభుత్వం చేపడతామని ప్రకటనలు చేస్తోంది. ఇప్పటికీ నిధులు కేటాయించిన దాఖలాలు లేవు. హంద్రీనీవా వెడల్పు పనులు ఆగిపోయాయి. జిల్లాకు ప్రధానంగా సాగునీటిని అందించేది తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవా. ఈ రెండింటి ద్వారా జిల్లా అవసరాలకు తగ్గట్టు నీరు తీసుకునే అవకాశమున్నా పాలక నిర్లక్ష్యంతో అవి పూర్తవకుండా ఉన్నాయి. రైతులకు నీరందే పరిస్థితులు కనిపించడం లేదు. అందుకే సిపిఎం సాగునీటి ప్రాజెక్టులపై పోరాటానికి సిద్ధమైంది. ఈ పోరాటం ఇంతటితో ఆగదు. ప్రభుత్వాల్లో చలనం తీసుకొచ్చే వరకు ఇది దశల వారీగా చేపడతాం. రాష్ట్ర ప్రభుత్వం నవంబరులో పెట్టే బడ్జెట్‌లో అనంతపురం జిల్లా సాగునీటి రంగానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాం.

ఇసుక, మద్యంపై ఉన్న శ్రద్ధ రైతాంగంపై ఏదీ..?

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

కూటమి ప్రజాప్రతినిధులకు ఇసుక అక్రమ రవాణా, మద్యం దందా చేసే విషయంలో ఉన్న శ్రద్ధ జిల్లా రైతాంగంపై ఏదీ..? అని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. ఆదివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. దేశంలోని జైసల్మేర్ తర్వాత అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతం అనంతపురం జిల్లా రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారన్నారు. చివరకు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాని పరిస్థితి ఉందన్నారు. ఈఏడాది 6 లక్షల ఎకరాల్లో మాత్రమే వేరుశనగ సాగు చేశారన్నారు. అందులో కూడా దిగుబడి రాలేదన్నారు. ఈనేపథ్యంలో ఉద్యానపంటలు, వ్యవసాయ పంటలు కలిపి రూ.1.48 కోట్లు మాత్రమే నష్టం జరిగిందని ప్రభుత్వానికి లెక్కలు పంపారంటే ఎంత అధ్వాన పరిస్థితి ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. కొత్త ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని తాము భావించామని, కానీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైతులు ఇబ్బంది పడే పరిస్థితి వచ్చిందన్నారు. జిల్లా రైతాంగం తరపున కలిసి వచ్చే పార్టీలతో వైసిపి ఆందోళనలు చేస్తుందని స్పష్టం చేశారు.

రైలులో మహిళ మృతి

ప్రజాశక్తి - గుత్తి



రైలులో మృతిచెందిన మహిళ

కన్యాకుమారి ఎక్స్ ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని ఓ మహిళ(55) ఆదివారం గుత్తిలో మృతి చెందింది. గుత్తి జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాల మేరకు పూణె నుంచి కన్యాకుమారి వైపునకు వెళ్తున్న ఎక్స్ ప్రెస్ (16381) రైలు గుత్తికి చేరుకుంది. అయితే రైలులో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని మహిళ ముక్కులో నుంచి రక్తం వస్తుండటంతో గమనించిన తోటి ప్రయాణికులు వెంటనే గుత్తి రైల్వే స్టేషన్ లోని జీఆర్పీ పోలీసులు, స్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రయాణికుల సమాచారంతో రైల్వే అధికారులు వెంటనే గుత్తి రైల్వే ఆసుపత్రి వైద్యులను స్టేషన్‌కు పిలిపించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మృతి చెందిన మహిళ ఆచూకీ తెలిస్తే 6305073235 నెంబర్ ను సంప్రదించాలని జీఆర్పీ ఎస్ఐ తెలిపారు. గుర్తు తెలియని మహిళ గుండె పోటుతో మృతి చెంది ఉంటుందని వైద్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు రైల్వే జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకొని మహిళ ఆచూకీ కోసం ఆమె ఫోటోను అన్ని పోలీసు స్టేషన్లకు పంపారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోనున్న సాగునీటి ప్రాజెక్టులకు రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. స్థానిక గణేనాయక్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ధర్నాకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోనున్న సాగునీటి ప్రాజెక్టులను పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఈనెల 15వ తేదీ నుంచి 19 వరకు ఐదు రోజుల పాటు సాగునీటి ప్రాజెక్టులను బస్సు యాత్ర ద్వారా సిపిఎం బృందం పరిశీలించిందని వివరించారు. ఏ ప్రాజెక్టు వద్ద చూసినా అనేక సమస్యలు ఉన్నాయని ఈ పరిశీలనలో వెల్లడైందన్నారు. బిటిపి, మిడ్‌పెన్నార్, జీడిపల్లి, సుబ్బరాయసాగర్ అన్నీ కూడా కనీస నిర్వహణ నోచుకోకుండా ఉన్నాయన్నది స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ యాత్రలో తాము 803 కిలోమీటర్లు 24 మండలాల్లో పర్యటించినట్లు చెప్పారు. జిల్లాకు ప్రధాన సాగునీటి వనరులుగా నున్న హంద్రీనీవా, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ రెండింటి పరిస్థితి అదే రకంగా ఉందన్నారు. నిర్వహణాలోపాలతో ఈ ఏడాది శ్రీశైలం, తుంగభద్ర డ్యాముల్లో పుష్కలంగా నీరున్నా తీసుకోలేకపోతున్నాయని చెప్పారు.కాలువ నిండా నీరు తీసుకుంటే ఎక్కడ గండ్లు పడతాయోనని అధికారులు ఆచితూచి నీటిని తీసుకుంటున్నారన్నారు. దీంతో ప్రధాన రిజర్వాయర్లు అన్నీ కూడా ఇప్పటికీ సగానికి కూడా నిండకుండా ఉన్నాయన్నారు. ఒకవైపు పంటలకు సరైన నీటి వసతిలేక భూములను రైతులు బీళ్లు పెట్టుకుంటున్నారన్నారు. ఈ పరిస్థితికి రెండు ప్రభుత్వాలదీ బాధ్యత ఉందని విమర్శించారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం జలవనరుల అధికారుల సమీక్ష నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే అది కేవలం 35, 36 ప్యాకేజీలకే పరిమితం కాకుండా మొత్తం జిల్లా ప్రాజెక్టుల పునరుద్ధరణపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. నవంబరులో పెట్టబోయే బడ్జెట్‌లో అనంతపురం జిల్లా సాగునీటికి నిధులు ప్రత్యేకంగా కేటాయించాలని డిమాండ్ చేశారు.

పంటలకు గిట్టుబాటు కల్పంచాలి

తమ బస్సు యాత్ర సందర్భంగా కనిపించిన మరిన్ని సమస్యల్లో గిట్టుబాటు ధరలున్నాయని చెప్పారు. మిర్చి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా ద్రాక్ష పంటకూ ధర లేక రైతులు పూర్తిగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణం గిట్టుబాటు ధర కల్పించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వర్షాలతో వ్యాపిస్తున్న చీడ పీడలకు మందులను సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై సోమవారం నిర్వహించే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఒ.నల్లప్ప, సావిత్రి, నాగేంద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాదర్బార్' సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

'ప్రజాదర్బార్'లో ప్రజల నుంచి స్వీకరించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఆదివారం అనంతపురం నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో 'ప్రజాదర్బార్' కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించి ప్రజల నుంచి పలు సమస్యలను తెలుసుకున్నారు. ఇందులో భాగంగా మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మడకశిర నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆధ్వర్యంలోని ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈసందర్భంగా మంత్రి దృష్టికి పలువురు నాయకులు, ప్రజలు పలు రకాల సమస్యలను తీసుకురాగా, ఎలాంటి ఆలస్యం కాకుండా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తక్షణం చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



తమ సమస్యలు మంత్రికి విన్నవిస్తున్న ప్రజలు

పశుసంపద పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ శుభదాస్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా పశుపోషణ, వాటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు శ్రీ సత్య సాయి జిల్లా పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ శుభదాస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పశుసంపద పరిరక్షణ గురించి పలు విషయాలను వెల్లడించారు.

ప్ర : సత్యసాయి జిల్లాలో ఎన్ని పశు వైద్యశాలలు ఉన్నాయి ?

జవాబు: శ్రీ సత్యసాయి జిల్లాలో మూడు డివిజన్లలో 15 ఏరియా వెటర్నరీ ఆసుపత్రులు, 72 పశు వైద్య కేంద్రాలు ఉన్నాయి. వీటితో పాటు గ్రామాలలోకి వెళ్లి పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. నడవలేని, లేవలేని ఆవులు, గేదెలు, ఎద్దుల కొరకు ఆయా మండలాల్లో అందుబాటులో అంబులెన్స్ సౌకర్యం కల్పించాం. పశువులను వైద్యశాలలకు తరలించేందుకు వీటిని వినియోగిస్తున్నాం.

ప్ర : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుసంపదను పరిరక్షించే చర్యలు ఏవి?

జ: పశు వైద్యశాలల పరిధిలో గొర్రెలకు, మేకలకు అంటువ్యాధులు వ్యాపించకుండా సంరక్షించుకోవడానికి తరచూ టీకాలు వేయించాలి. గేదెలకు, ఆవులకు, ఎద్దులకు గొంతు వాపు , సోప్ప వాపు వ్యాధి తరచూ వస్తూ ఉంటాయి. వీటి నుంచి పశువులను సంరక్షించుకోవడానికి గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి టీకాలు వేయడం, మందులు ఉచితంగా పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వర్షాకాలంలో పశువులకు వ్యాపించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. గొర్రెలు, మేకలకు నట్టల వ్యాధి సోకకుండా తరచూ మందులు వాడాలి. ఈ వ్యాధి నివారణ కొరకు అక్టోబర్ 16వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ప్ర : పశుసంవర్ధక శాఖ పరంగా జిల్లాలో రైతులకు ఏయే ప్రోత్సాహకాలు అందుతున్నాయి ?

జ: జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో సమీకృత దాణా 50 శాతం సబ్సిడీతో పశుసంపద కలిగిన రైతులకు అందజేస్తున్నాం. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పశు వైద్యశాలలో డాక్టర్ల వద్ద నమోదు చేసుకున్న రైతులకు ఈ దాణా పంపిణీ చేసాం. జిల్లావ్యాప్తంగా 150 టన్నుల దాణా సబ్సిడీ ధరలకు అందించాం. అంతేకాక రైతుల అవసరాల మేరకు వారికి కావలసినంత స్టాకును తెప్పించి రైతులకు అందజేయనున్నాం.

ప్ర : పశువుల పెంపకం దారులకు ప్రభుత్వం నుండి అందుతున్న ప్రోత్సహకాలు ఏవీ?

జ: పశు సంపద కలిగిన రైతులను ప్రోత్సహించడానికి శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా



ప్రభుత్వం 1325 గోకులం షెడ్లను మంజూరు చేసింది. రెండు, నాలుగు, ఆరు ఆవుల కొరకు షెడ్లను మంజూరు చేసి, రైతు వాటా కింద 10 శాతం చెల్లింపుతో షెడ్లను నిర్మించి రైతులకు అందిస్తున్నాం. రెండు ఆవుల షెడ్లకు రైతు 10 శాతం అనగా రూ.11,500 చెల్లిస్తే రూ. 1. 35 లక్షలు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది.

ప్ర : జిల్లాలో పశు వైద్య శాలల్లో సిబ్బంది కొరత ఉందా?

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 72 మంది పశు వైద్యాధికారులు ఉండాలి. కానీ ప్రస్తుతం 40 మంది వైద్యులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. 32 పశు వైద్యుల కొరత ఉంది. పశు వైద్య సహాయకులు పదిమంది ఉండాలి. కానీ ప్రస్తుతం ఏడుగురు ఉన్నారు. జిల్లాలో ఏడీలు 15 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా శిథిలావస్థకు చేరుకున్న పశు వైద్యశాలల భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించడానికి ప్రభుత్వ అనుమతులకు పంపాం. అవి మంజూరు అయితే కొత్తచెరువు, కల్లూరు, సికె పల్లి, ఎన్నీకుంట, తలుపుల మండలాల్లో నూతన భవనాలు నిర్మించనున్నాం.



డాక్టర్ శుభదాస్

హాస్టల్ స్థల సమస్యను పరిష్కరించాలని వినతి

ఉరవకొండ : ఉరవకొండలోని గాంధీ హరిజన హాస్టల్ స్థల సమస్యను పరిష్కరించాలని హాస్టల్ కమిటీ సభ్యులు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరారు. ఈమేరకు ఆదివారం అనంతపురంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆర్థికమంత్రిని కలిసి విన్నవించారు. హాస్టల్ స్థలం సమస్యను పరిష్కరించి ఎస్సీలకు న్యాయం చేయాలని కోరారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కష్టం నేలపాలు..



అనంతపురం చెరువుకు కట్టపై పారబోసిన పూలు

అనంతపురం రూరల్ : కర్షకుల కష్టం నేలపాలైంది. ఐదు రోజుల నుంచి భారీ వర్షాలు కురవడంతో పూల ధరలు అమాంతంగా పడిపోయాయి. దీంతో పూలు సాగు చేసిన రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇందులో భాగంగానే చెండుపూలు సాగు చేసిన ఓ రైతు ఆదివారం మార్కెట్‌కు తీసుకొచ్చాడు. అయితే మార్కెట్‌లో పూలధరలు పూర్తిగా పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. చేసేది లేక.. ఆఖరికి బాడుగకు రాని పరిస్థితి నెలకొనడంతో నగర సమీపంలోని చెరువు కట్టపైన రోడ్డుపై పారబోసి వెళ్లాడు.

నట్టల నివారణ మందులు పంపిణీ

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని వేపులపర్తి, పాలవెంకటాపురం గ్రామాల్లో గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు తాపినట్లు మండల పశు వైద్యాధికారి నవీన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎలాంటి వ్యాధులు సోకకుండా మందులు తాపుతున్నట్లు తెలిపారు. పాలవెంకటాపురంలో 1,350, వేపులుపర్తిలో 2586 జీవాలకు టీకాలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది సుధ, అబ్దుల్లా, సుధీర్‌కుమార్, కులశేఖర్, జలీల్, లింగన్నగౌడ్, మంజుల, సుధీర్, నవీన్, గీత, భానుప్రియ ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.



గొర్రెలకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి నవీన్‌కుమార్

నష్టపోయిన ద్రాక్ష రైతులను ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి-ఉరవకొండ

మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు నెలకొరిగిన ద్రాక్ష తోటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం అమ్ముచ్చపల్లి గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న ద్రాక్ష తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్ముచ్చపల్లిలో రైతు శ్రీనివాసులు సుమారు రూ.10లక్షల వరకూ పెట్టుబడి పెట్టి ద్రాక్ష పంటను సాగు చేశారన్నారు. 2022లో చిన్నమొక్కలు తెచ్చి రెండేళ్లుగా కాపు కాచి, ఎరువులు పెట్టి, పైప్‌లైన్ చేసి, కంచె వేసుకుని పంటను సాగు చేస్తున్నాడ న్నారు. అయితే పంట చేతికొచ్చే సమయంలో ఇలా వర్షార్పణ కావడం బాధాకరమన్నారు. ఒక్కరోజు ఉంటే పంటను కోసేవార మని రైతు వాపోయాడన్నారు. తిరిగి బండలు, మొక్కలు నాటుకో వాలన్నా అదనంగా రూ.లక్ష ఖర్చు అవుతుందన్నారు. తక్షణం ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ద్రాక్ష పంట నష్టపోయిన రైతులకు రూ.15లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వెంకటేషులు, ఎస్.కరీం, వీరప్ప, వీరాంజనేయులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న ద్రాక్షతోటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

సమాజ పురోగతి దిశగా ఆధునిక సాహిత్యం

ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

సమాజ పురోగతి దిశగా ఆధునిక సాహిత్యం అడుగులు వేస్తోందని ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ భవన్‌లోని ఎసి హాల్‌లో విమలాశాంతి కవితా పురస్కార ప్రదాన సభ నిర్వహించారు. ముందుగా పురస్కార వ్యవస్థాపకురాలు విమల చిత్రపటానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. తర్వాత తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లాకు చెందిన ప్రైమరీ పాఠశాల టీచర్ లేదాళ్ల రాజేశ్వరరావుకు విమలాశాంతి కవితా పురస్కారంతోపాటు రూ.10వేల నగదును అందజేశారు. అనంతరం సభకు అధ్యక్షత వహించిన రాచపాలెం మాట్లాడుతూ రాయలసీమ సాహిత్యం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ముఖ్య అతిథి నాగార్జున విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ చల్లపల్లి స్వరూపరాణి మాట్లాడుతూ వెనకబడిన ప్రాంతాల నుంచే గొప్ప సాహిత్యం వస్తుందన్నారు. ఇందుకు నిదర్శనం రాయలసీమ అన్నారు. ముఖ్యంగా అనంతపురం జిల్లా నుంచి వస్తున్న సాహిత్యం ప్రధానంగా ఉందన్నారు. విశిష్ట అతిథి తూముచెర్ల రాజారాం తెలుగు సాహిత్య లోకంలో విమలాశాంతి సాహిత్య పురస్కారానికి ఉన్న విశిష్టతను తెలుపుతూ పురస్కారం పొందిన కవితా సంపుటిలోని ఔన్నత్యాన్ని వివరించారు. యువ సాహిత్య విమర్శకుడైన అంకే శ్రీనివాస్ తన పుస్తక సమీక్షలో రచయిత కవిత్వతత్వాన్ని, కవితా వస్తువులను, కవిత్వ సౌందర్యాన్నీ రమణీయంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సడ్లపల్లి చిదంబరరెడ్డి, మారుతీపౌరోహితం, కొత్తపల్లి సురేష్, సంస్థ అధ్యక్షుడు శాంతినారాయణ, శాంతి మంజుల, శాంతి కిరణ్‌కుమార్, ప్రజాగాయకులు దాసరి ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, కంబదూరి షేక్‌నబీరసూల్, తదితరులు పాల్గొన్నారు.




విమలాశాంతి కవితా పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న అతిథులు

ప్రతి ఒక్కరూ సేవాభావంతో మెలగాలి

ప్రజాశక్తి-గుత్తి

ప్రతిఒక్కరూ సేవాభావంతో మెలగాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం పట్టణంలోని విరూపాక్షిరెడ్డి కన్వర్షన్ హాలులో గుత్తికోట లయన్స్ క్లబ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ముందుగా ముఖ్య అతిథులు సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథాచారి, పెరుమాళ్ల జీవానందరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయ మన్నారు. తర్వాత వృద్ధులు, యాచకులకు దుస్తులను పంపిణీ చేశారు. ఇకపోతే గుత్తి కోట లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులుగా బిసి.వెంకప్ప, ఉపాధ్యక్షులుగా డాక్టర్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, ఇసికల గోపాల్, కార్యదర్శిగా ఎస్.మహబూబ్‌బాషా, కోశాధికారిగా శ్రీనివాసులు, సభ్యులుగా వై.హనుమేష్‌రెడ్డి, కె.వారీస్ హుస్సేన్‌అలీ, పి.అనిల్‌కుమార్, యం.శంకరన్నారాయణ గుప్తా, పి.నవీన్‌కుమార్, శ్రీకరం రవి, వి.నాగేంద్ర, బి.సత్య, కె.హేమలత, ఎ.పులికొండ, అశ్వనాగప్ప, బి.మురళీమోహన్‌రెడ్డి, బసిరెడ్డి పుల్లారెడ్డి, బి.వెంకటరాముడు, ఆర్.రంగస్వామి, ఎం.వెంకటరాముడు, సుకుర్, ఎం.రామకృష్ణ, బి.పాపన్న, కె.నాగరాజు, ఎస్.కుళ్లాయప్ప, ఎస్.కిష్టప్ప, డి.రమేష్‌రెడ్డిని ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మల్టిపుల్ జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వరావు, ఉపాధ్యక్షుడు గవర్నర్ డాక్టర్ యం.విరూపాక్షరెడ్డి, సి.రమేష్‌నాథరెడ్డి, గుత్తి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టి.శ్రీనివాసులు, కోశాధికారి శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-నార్పల

జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్రీ నేతాజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆదివారం రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కూచిపూడి జోసెఫ్ మాట్లాడుతూ షూటింగ్ బాల్ క్రీడ జిల్లాలో బాగా అభివృద్ధి చెందుతోందన్నారు. జిల్లాలో క్రీడ అభివృద్ధికి తమవంతు సహాయం ఎప్పుడూ ఉంటుందన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు 350 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్ అంతా జిల్లా సెక్రటరీ ఎం.మనోహర్‌రెడ్డి జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో నేతాజీ పాఠశాల ఎం.మునిరెడ్డి, కరెస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ తేజోవంత్‌రెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ డి.స్వర్ణకుమారి, సత్యసాయి జిల్లా సెక్రటరీ పూల ప్రసాద్, రాష్ట్రంలోని జిల్లాల సెక్రటరీలు ఈశ్వర్‌నాయుడు, సురేంద్ర, కిషోర్, రత్నం, రవి, ముత్యం, ప్రవీణ్, అమీర్‌హుస్సేన్, పీడీలు బి.నాగరాజు, ఉషారాణి, నవత, అశ్విని, నేతాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ పిఇటి, చెన్నకేశవ, క్రీడాకారులు పాల్గొన్నారు.




రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

మరువకొమ్మ బ్రిడ్జి నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-నార్పల

శింగనమల మండల కేంద్రం సమీపంలోని మరువకొమ్మ వద్ద చెరువు మరువపై బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విన్నవించారు. ఈమేరకు రాజధానిలో సిఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా కురిసి శింగనమల చెరువు మరువ పారితే మండల కేంద్రానికి వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిఎం దృష్టికి తీసుకెళ్లారు. మరువకొమ్మ వద్ద బ్రిడ్జి ఏర్పాటు చేస్తే ప్రజలందరికీ సౌకర్యంగా ఉంటుందన్నారు. అలాగే యోజకవర్గంలోని యల్లనూరు, పుట్లూరు, నార్పల, గార్లదిన్నె మండలాల్లో దాదాపు 39 వేల ఎకరాలో రైతులు చీనీ పంటను సాగు చేస్తారన్నారు. ఇలాంటి నియోజకవర్గంలో ప్రాసెసింగ్ యూనిట్ తయారు చేస్తే సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈమేరకు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 800 కిలోమీటర్ల మైలురాయి ఆవిష్కరణ సందర్భంగా మర్తాడు గ్రామంలో యూనిట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మరువకొమ్మ బ్రిడ్జితోపాటు మర్తాడు ప్రాసెసింగ్ యూనిట్‌కు సంబంధించిన సహాయ, సహకారాలు, నిధులు అందించాలని కోరగా సిఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



సిఎం చంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

టిబి రోగి పెద్దపేగుకు క్యాన్సర్!

కిమ్స్ సవీరా ఆసుపత్రిలో విజయవంతంగా చికిత్స

ప్రజాశక్తి-అనంతపురం

టిబి రోగి పెద్దపేగుకు క్యాన్సర్‌కు సంబంధించిన శస్త్రచికిత్సను నగరంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రిలో విజయంతంగా నిర్వహించారు. ఈమేరకు కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ఎన్.మహ్మద్ షాహిద్ ఇందుకు సంబంధించిన వివరాలన ప్రజాశక్తికి వెల్లడించారు. కుళ్లాయప్పకు పెద్దపేగుల క్యాన్సర్ ఉండటంతో శస్త్రచికిత్స చేసి తొలగించాలని నిర్ణయించామన్నారు. అయితే అతడికి టీబీ కూడా ఉండటంతో ముందుగా పల్మనాలజిస్టు అభిప్రాయం తీసుకోగా శస్త్రచికిత్స చేసిన తర్వాత ఏటీటీ మందులతో చికిత్స చేయాలని ఆయన సూచించారన్నారు. దీంతో ముందుగా రోగికి ఎడమవైపు హెమికోలెక్టమీ అనే శస్త్రచికిత్స చేసి పెద్దపేగులో క్యాన్సర్ ప్రభావితమైన భాగాన్ని పూర్తిగా తొలగించామన్నారు. మిగిలిన భాగాన్ని కలిపి కుట్టేశామన్నారు. రోగికి టీబీ ఉండటంతో శస్త్రచికిత్స చేసిన తర్వాత కొద్దిరోజులు ఐసోలేషన్ గదిలో ఉంచి ఐదు రోజుల తర్వాత ఎలాంటి సమస్యలు లేకపోవడంతో ఏటీటీ మందులు వాడటం మొదలుపెట్టామన్నారు. కొలోరెక్టల్ క్యాన్సర్ అనేది పెద్దపేగులకు సంబంధించి వచ్చే క్యాన్సర్లలో చాలా తరచుగా వస్తుందన్నారు. స్ప్లినిక్ ఫ్లెక్సర్ క్యాన్సర్‌నే కొలోన్ క్యాన్సర్ అంటారన్నారు. ఇది అన్నిరకాల కొలోన్ క్యాన్సర్లలో 2-8శాతం మాత్రమే ఉంటుందన్నారు. స్ప్లినిక్ ఫ్లెక్సర్ క్యాన్సర్‌కు అధిక మూలకణ రుగ్మత ప్రధాన కారణమన్నారు. దీని నిర్ధారణ ఆలస్యమైతే చికిత్స కూడా కొంత కష్టం అవుతుందన్నారు. అయితే, ఇతర కొలోన్ క్యాన్సర్లతో పోలిస్తే ఇందులో కూడా జీవనప్రమాణంలో పెద్దగా మార్పు ఉండదని పరిశోధనల్లో తేలిందన్నారు. దీనికి శస్త్రచికిత్స చేసేటప్పుడు ప్రభావితమైన లింఫ్ నోడ్లు అన్నింటినీ కూడా తొలగిస్తే ఫలితాలు మెరుగ్గా ఉంటామని వివరించారు.



రోగితో డాక్టర్ మహ్మద్‌షాహిద్

అంగన్వాడీ ఇంటి యజమానిపై కేసు నమోదు చేయాలి

బ్రహ్మసముద్రం : బ్రహ్మసముద్రం మండలం పడమటి కోడిపల్లి అంగన్వాడీ కేంద్రంలో కుల వివక్ష చూపిన ఇంటి యజమానిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పడమటి కోడిపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఇద్దరు దళిత పిల్లలపై కులవివక్ష చూపి కేంద్రం బయట కూర్చోబెట్టడం బాధాకరమన్నారు. కులవివక్ష చూపిన ఇంటి యజమానిపై చర్యలు తీసుకోకుండా ఎలాంటి సంబంధం లేని అంగన్వాడీ సెంటర్ నిర్వాహకులు ఆయా దాసక్క, అంగన్వాడి కార్యకర్త యశోద, సూపర్‌వైజర్ రామాంజినమ్మకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. షోకాజ్ నోటీసులను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అంగన్వాడీ కేంద్రంలో వివక్షకు బాధ్యులైన ఇంటి యజమానిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసును నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

యల్లనూరు : ఎస్పీ జగదీశ్ ఆదేశాల మేరకు మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిఐ సత్యబాబు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇందులో భాగంగా పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని పిలిపించి మాట్లాడారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో అందరూ సమానమే అన్నారు. ఎవరు చట్టాన్ని ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

22 నుంచి ఆధార్‌క్యాంప్

పామిడి : మండల కేంద్రంలోని ఎద్దులపల్లి రోడ్డు సచివాలయంలో 22 నుంచి 25వతేదీ వరకూ ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నట్లు ఎంపిడిఒ తేజోష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పూర్వవిద్యార్థుల కలయిక

బెలుగుప్ప : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96లో పదో తరగతి చదుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తర్వాత ఒకరినొకరు యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ మల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటశ్యామ్, ఉపాధ్యాయులు కోటేశ్వరయ్య, వీరభద్రప్ప, రామిరెడ్డి, వెంకటనాయుడు, గోవిందప్ప, వెంకటరమణ, దస్తగిరి, కృష్ణయ్యచౌదరి, రత్నమ్మ, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

యాడికి : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ లియో క్లబ్ ఆధ్వర్యంలో ఆర్డీటీ సహకారంతో ఈనెల 21న సోమవారం మండల పరిధిలోని రాయలచెరువు గ్రామం లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఉచిత మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు చల్లా సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ముగ్గురు వ్యక్తుల ప్రాణాల్ని కాపాడవచ్చన్నారు. కావున 18ఏళ్లు నిండి 60ఏళ్లలోపు ఉండి ఆరోగ్యవంతులు ఎవరైనా రక్తదానం చేయవచ్చన్నారు.

అనాథ మహిళ ఆశ్రమానికి తరలింపు

రాయదుర్గం : రాయదుర్గం పట్టణంలోని కోట మారమ్మ గుడి వెనక వీధిలో మతిస్థిమితం సరిగా లేని ఒంటరి అనాథ మహిళను స్థానిక స్వచ్ఛంద సంస్థ చేంజ్ ఫర్ సొసైటీ సభ్యులు ఆదివారం అనాథాశ్రమానికి తరలించారు. సుమారు 40ఏళ్లు పైబడిన మహిళ మతిస్థిమితం లేక పట్టణంలోని కోట మారమ్మ గుడి వెనక వీధిలో తిరుగూ ఇబ్బందులు పడేది. గమనించిన కాలనీవాసులు చేంజ్ ఫర్ సొసైటీ బృందానికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన చేంజ్ ఫర్ సొసైటీ సభ్యులు, సామాజిక కార్యకర్త బిఎం.నాదల్, దాతల సహకారంతో నార్పల మండలంలోని కురగానపల్లిలో ఉన్న చెన్నకేశవ అనాథ, వృద్ధుల ఆశ్రమానికి తరలించారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సాధన కమిటీ అధ్యక్షులు బి.ఎం.నాదల్, సాధిక్, నాయకుల రామాంజినేయులు, మహిళా సమైక్య తాలూకా ప్రధాన కార్యదర్శి పార్వతి, చేంజ్ ఫర్ సొసైటీ టీం సభ్యులు కెపి.దొడ్డి మంజునాథ్, భారతి, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి ఆలయ నిర్మాణానికి విరాళం



ధర్మతేజను సన్మానిస్తున్న వాల్మీకులు

కుందుర్పి : ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు వాల్మీకి ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల చెక్కును నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధర్మతేజ మండల వాల్మీకి సంఘం నాయకులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వాల్మీకులు మాట్లాడుతూ అమిలినేని సురేంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామే మేరకు వాల్మీకి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేయడం సంతోషకరమన్నారు. అనంతరం ధర్మతేజను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకులు బసప్ప, జిన్న ఓబులేశు, టీచర్ తిమ్మప్ప, రంగనాథ్, మర్రిస్వామి, బాలు, వెంకటేష్, పురుషోత్తమ్, మూర్తి, నారాయణ, నారాయణస్వామి, నాగేంద్ర, బుజ్జి, శివ లక్ష్మణమూర్తి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథ్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు

బ్రహ్మసముద్రం : ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన విశ్వనాథ్‌రెడ్డిపై ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యేపై విశ్వనాథ్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో టిడిపి నాయకులు ప్రభావతి, వెంకటేశులు, వన్నూరుస్వామి, పెంకుల మల్లికార్జున, సుభాన్, అమరా రాంమోహన్, వెంకటేశులు, తిరుమల, నంజాపురం రాము, ఎర్రిస్వామి, హనుమంతు, డీలర్ లచ్చన్న, స్కూల్ కమిటీ ఛైర్మన్ మల్లికార్జున, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యార్థిని ఆత్మహత్య



మృతిచెందిన జయశ్రీ

పుట్లూరు : విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని బాలాపురం గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాలాపురం గ్రామానికి చెందిన దేవరశెట్టి నారాయణస్వామి కూతురు జయశ్రీ (16) అనంతపురంలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. దసరా పండుగ సెలవుల సందర్భంగా ఇంటికి వచ్చిన జయశ్రీ మ్యాథ్స్‌లో రాణించలేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురవుతూ ఉండేది. ఈనేపథ్యంలో శనివారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న ఎస్ హేమాద్రి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి తండ్రి నారాయణస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదివారం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాడుగ పట్టలకు నిప్పు

పుట్లూరు : మండల పరిధిలోని సంజీవపురం గ్రామానికి చెందిన తలారి నాగప్పకు చెందిన బాడుగపట్టలకు గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి నిప్పు పెట్టారు. దీంతో సుమారు 60 బాడుగ పట్టలు దగ్ధమయ్యాయి. ఫలితంగా సుమారు రూ.30 వేల వరకూ నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు హెడ్ కానిస్టేబుల్ శ్యామెల్, కానిస్టేబుల్ పెద్దన్న ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

